క్లుప్తంగా

నూతన దంపతులకు 'గుత్తా' శుభాకాంక్షలు



నూతన వధూవరులకు మొక్క అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, తదితరులు

కోదాడ : కోదాడలో బుధవారం జరిగిన న్యాయవాది పగడాల రాంచంద్రారెడ్డి కుమార్తె శ్రావ్యారెడ్డి- జయంత్‌రెడ్డిల వివాహానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు లక్ష్మీనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్లయ్యయాదవ్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో జాన్వీకి ద్వితీయ స్థానం



విద్యార్థిని జాన్వీని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిలుకూరు : సూర్యాపేటలో జిల్లా ఫిజిక్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని షేక్ జాన్వీ ద్వితీయ స్థానం సాధించింది. దీంతో ఆ విద్యార్థినిని బుధవారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించాలి



ఎంపీ బడుగుల లింగయ్యకు వినతిపత్రం ఇస్తున్న లీలావతి

హుజూర్‌నగర్ : మహిళల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించాలని విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు చీకూరి లీలావతి.. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను కోరారు. బుధవారం హుజూర్‌నగర్ వచ్చిన ఎంపీకి ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలకు పీరియడ్స్ సమయంలో అవసరమైన రసాయనాలు రహిత శానిటరీ నాప్కిన్‌లను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన, కౌన్సిలర్ మంగమ్మ, బానోతు జానకి, గాయత్రి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రదీప్‌కు నివాళి



మాతరం యూత్ ఆధ్వర్యంలో చిన్నారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : కుక్కల దాడిలో చిన్నారి మృతి చెందడం బాధాకరమని మాతరం యూత్ అధ్యక్షుడు జింకల భాస్కర్ అన్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో కుక్కల దాడిలో మృతి చెందిన చిన్నారి ప్రదీప్ చిత్రపటానికి బుధవారం నేరేడుచర్లలో మాతరం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మాతరం యూత్ సభ్యులు యారవ సురేష్, రామకృష్ణ, ఇంతియాజ్, రవి, పినాకిన్ స్కూల్ ప్రిన్సిపాల్ మధార్, బీఎస్‌పీ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్, సతీష్‌రెడ్డి, నాగార్జున తదితరులున్నారు.

25న కోదాడలో జాబ్ మేళా

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని పెరిక కల్యాణ మండపంలో ఈ నెల 25న బీఆర్‌ఎస్ పార్టీ నియోజవర్గ మాజీ అధ్యక్షుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అన్నెం వీరనాగిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని రామలక్ష్మీపురంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, మణికంఠ తదితరులు ఉన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

మునగాల : వెనుకబడిన వర్గాలైన బీసీలకు రుణాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం మునగాల మండల అధ్యక్షుడు చింతకాయల నాగరాజు కోరారు. బుధవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా బీసీ వర్గాలకు ఒక్క రూపాయి రుణం కూడా మంజూరు చేయలేదని వాపోయారు. దీంతో వెనకబడిన బీసీ వర్గాలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ వలయాలు లేక ప్రమాదకరం
- పట్టించుకోని అధికారులు
- తొలగించాలని వేడుకోలు



రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బేతవోలులో జనావాసాల మధ్య..

చిలుకూరు : మండలంలో పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు గత కొన్నేళ్లుగా రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా మండలంలోని బేతవోలు రోడ్డులో చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం, రామాపురం రోడ్డులో అలాగే చిలుకూరులో ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచె లేకుండా రోడ్ల వెంట ఉన్నాయి. దీంతో ప్రజలు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. మండల వ్యాప్తంగా సుమారుగా 35 ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు పక్కన, జనావాసాల మధ్య, పాఠశాలల పక్కన ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరగతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుపక్కన ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులకు ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. తక్షణమే రోడ్డు పక్కన గల ట్రాన్స్‌ఫార్మర్లను అక్కడ నుంచి తొలగించి రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలి.

– గోగుల వీరభద్రయ్య, చిలుకూరు

త్వరలో తొలగిస్తాం



మండలంలో రోడ్డు పక్కన కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్న మాట వాస్తవమే. బేతవోలు నుంచి చెన్నారిగూడెం, జెర్రిపోతులగూడెంలో రోడ్ల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మండల వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటికి ఎస్టిమేషన్ వేసి తొలగిస్తాం.

– కందరబోయిన సైదయ్య ట్రాన్స్‌కో ఏఈ, చిలుకూరు

పల్లె ప్రగతితో గ్రామాల్లో గుణాత్మకమైన మార్పు

- కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



నర్సింహాపురంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల : తెలంగాణలో పల్లె ప్రగతితో గ్రామాల్లో గుణాత్మకమైన మార్పు వచ్చిందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని ఆకుపాముల, నర్సింహాపురం, కోదండరామాపురం గ్రామాల్లో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా నరసింహాపురంలో రూ.15 లక్షలు, కోదండరామాపురంలో రూ.22 లక్షలు, ఆకుపాముల గ్రామ పంచాయతీ పరిధిలో రూ.30 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎనిమిది ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సమృద్ధిగా అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మంచి చేయడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి వర్గాన్ని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తొగరు రమేష్, పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, వల్లపురెడ్డి రామిరెడ్డి, సర్పంచ్‌లు కేసగాని వెంకటేశ్వర్లు, నాగమణి, దేవరకొండ రమేష్, మండల నాయకులు ఎలక వెంకటరెడ్డి, వేమూరి సత్యనారాయణ, బొమ్మ చినవెంకన్న పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎం రిలీఫ్ ఫండ్

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : సీఎం రిలీఫ్ ఫండ్ పేదప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీకి చెందిన బొట్టపర్తిని రవి అనారోగ్యానికి గురి కాగా వైద్య ఖర్చుల నిమిత్తం అతనికి ప్రభుత్వం నుంచి వచ్చిన లక్ష రూపాయల ఎల్‌ఓసీ పత్రాన్ని బుధవారం హుజూర్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, నాయకులు మార్కెండేయ, రాములు, నర్సింహ, గిరి, సైదులు, శ్రీకాంత్, ఉదయ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

తాగు నీటి సమస్యపై పట్టింపేదీ!

- తాగునీటి ఎద్దడి నివారణకు సమావేశం
- 17 మంది సర్పంచ్‌లకు ఇద్దరు, ఎంపీపీతో పాటు ఒక్కరే ఎంపీటీసీ హాజరు



సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

చిలుకూరు : చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తాగునీటి సమస్య పరిష్కారానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఒక్కరిద్దరు ప్రజాప్రతినిధులు తప్ప మిగతావారందరూ డుమ్మా కొట్టారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు కేవలం నారాయణపురం, సీతారాంపురం గ్రామాల సర్పంచ్‌లు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. అలాగే 11 మంది ఎంపీటీసీలకు గాను ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్యతో పాటు కొండాపురం ఎంపీటీసీ మాత్రమే హాజరయ్యారు. అయితే రానున్న ఎండకాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తుగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. కానీ ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో సమావేశం లక్ష్యం నేరవేరకుండా పోయింది. మరోపక్క ప్రజాప్రతినిధులకు తాగునీటి సమస్య పరిష్కారానికి పట్టింపు లేకుండా పోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా సమావేశంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతీకోటయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ జానిమియా, మిషన్ భగీరథ డీఈఈ దేవభిక్షం, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండు యాదవ్, గ్రిడ్ ఏఈ రిత్విక్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కేసీఆర్



హుజూర్‌నగర్‌రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న వేముల శేఖర్‌రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తుందని బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం ఆరోపించారు. బుధవారం మండలంలోని బూరుగడ్డలో నిర్వహించిన శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఇంటికో ఉద్యోగం ఇస్తానన్న చెప్పిన కేసీఆర్ నేడు తన కొడుకు, బిడ్డ, అల్లుడికి తలా ఒక ఉద్యోగం ఇచ్చి నెలకు రూ. 25 లక్షల జీతం ఇస్తున్నాడని విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి బుల్లెట్ ప్రూఫ్ గోడలు ఉన్న 100 బెడ్ రూములతో ప్రగతి భవన్ కట్టుకున్నాడని ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం నిధులు ఇస్తుంటే వాటిని కమీషన్ల కోసం ప్రాజెక్టులకు మలిపారని ఆరోపించారు. అనంతరం శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశంలో చేస్తున్న సంస్కరణలు చూసి ప్రపంచ దేశాలే ఆయనను పొగుడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధికార ప్రతినిధి అంబళ్ల నరేష్, పార్టీ మండల అధ్యక్షుడు కుందురు కోటిరెడ్డి, మాదుగుల లక్ష్మీనారాయణ, గూడెపు సతీష్, పాపారావు, ఉమామహేశ్వరరావు, జనార్దన్‌రెడ్డి, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోదాడఅర్బన్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య అన్నారు. బుధవారం కోదాడలోని 14వ వార్డులో గల 180, 181 శక్తి కేంద్రాల్లో శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్ కోటకొమ్ముల భాగ్యమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో మద్యం ఏరులై పారే విధంగా బెల్ట్ దుకాణాలు పెట్టి ప్రభుత్వం ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు రాము, జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, శక్తి కేంద్ర కోఆర్డినేటర్ సాతులూరి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, దళిత మోర్చా అధ్యక్షుడు శంకర్, మునగ నరేష్, వినయ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల జోలికొస్తే ఉపేక్షించం



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : న్యాయవాదుల జోలికొస్తే ఉపేక్షించేది లేదని పలువురు న్యాయవాదులు అన్నారు. న్యాయవాదులపై దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులను ఖండిస్తూ బుధవారం హుజూర్‌నగర్‌లో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సైదానాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, మాధవరెడ్డి, యాదగిరి, అంజయ్య, సురేష్, మహేష్, నరేష్, వీరయ్య, శంకర్, వెంకటేష్, రామలక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన



కరివిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాలలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని బుధవారం ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు గ్రామ సమీపాన గల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ గతంలో రెండు సార్లు కాలిపోయిందని, దీంతో తామే సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించామని, మళ్లీ ఇటీవల మూడోసారి కాలిపోయిందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్, ఆఫ్ సౌకర్యం కూడా లేదని చెప్పారు. ఈ విషయాన్ని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా స్పందించడం లేదని, దీంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు నర్రా వెంకటరెడ్డి, రణబోతు మాధవరెడ్డి, కుందూరు రమణారెడ్డి, నరేందర్‌రెడ్డి, ముత్తయ్య, రామిరెడ్డి, వీరారెడ్డి, వెంకన్న, మార్కు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యాశాఖ మంత్రిగా వాసంతి, కలెక్టర్‌గా నవ్య, డీఈఓగా ఈశ్వర్, ఎంఈఓగా ముకుంద ప్రియ, ప్రధానోపాధ్యాయుడిగా శ్వేతలు వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం హుజూర్‌నగర్‌కు చెందిన ఓపెన్ ఐస్ సొసైటీ వారు ప్రమీల పార్‌బాయిల్డ్ రైస్ మిల్లు యాజమాని మామిడి సత్యనారాయణ- ప్రమీల దంపతుల షష్టిపూర్తి సందర్భంగా వారు అందజేసిన రూ.8వేల సహకారంతో విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ సీతారాంరెడ్డి, ఎంపీటీసీ ప్రమీల వెంకటరమణారెడ్డి, గరిడేపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, సొసైటీ సొసైటీ సభ్యులు, చందు, కృష్ణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బి.శ్రీను, ఉపాధ్యాయులు శ్రీను, రేణుక, విజయలక్ష్మి తదితరులున్నారు.

కోదాడలో ఘనంగా కవలల దినోత్సవం



కవలలచే కేక్ చేయిస్తున్న శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ సభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని శ్రీ కోదండరామాలయ ప్రాంగణంలో శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవలలతో కేక్ కట్ చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, జి.సాయి, నరేందర్, కోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, సత్యరామచంద్ర, శ్వేత, చంద్రకాంత్, శ్వేతా, కవలలు రిత్వికా, రుషిక, రిషిత, రిషికేష్‌లు పాల్గొన్నారు.

వైభవంగా బాలకోటేశ్వరస్వామి వసంతోత్సవం



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం శివారులోని శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం స్వామివారి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, కోలాట ప్రదర్శనతో స్వామివారిని ఊరేగించారు. మహాశివరాత్రి సందర్భంగా జిల్లా సరిహద్దు గ్రామమైన ఖమ్మం జిల్లా కూసుమంచి జక్కేపల్లి గ్రామానికి చెందిన భక్తులు మాలధారణ వేసి, ఆలయం వద్ద ఇరుముళ్లు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో వల్లాపురం గ్రామ మాజీ సర్పంచ్ తవనం వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ ప్రమీల, జక్కేపల్లి సహకార సంఘం చైర్మన్ చంద్రారెడ్డి, కొమరగిరి పితాంభరావు, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ధర్మకర్త ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, రామనర్సయ్య, సైదులు, రాములు, గోపయ్య, భూపాల్‌రెడ్డి, శ్రీను, మధుసూదన్‌రెడ్డి, రాంబాబు, సైదిరెడ్డి, వెంకన్న, వెంకటరాములు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై సమీక్షా సమావేశం

కోదాడరూరల్ : వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగు నీటి సమస్యపై ప్రజాప్రతినిధులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్యలు ఎదురవుతున్న వార్డులను గుర్తించి వెంటనే వాటిని పరిష్కరించాలని కోరారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీఓ తుమ్మల నాగేశ్వరరావు, ఏఈలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

నడిగూడెం : వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తాగు నీటి సమస్యపై నిర్వహించిన అత్యవసర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో తాగు నీటి సరఫరా పైపుల లీకేజీ లేకుండా చూడాలని, నల్లాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, ఏఈ ఇర్ఫాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



మునగాల : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ప్రమీల

మునగాల : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లపాటి ప్రమీల కోరారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమె కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మునగాలలో బుధవారం 25 రోజుల పాటు కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతకాయల ఉపేందర్ ఎంపీటీసీ-1, 2 సభ్యులు కాసర్ల కల్పన, ఉప్పుల రజిత, ఉప సర్పంచ్ ఎల్.వెంకయ్య, కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవీందర్, కంటి వెలుగు ఇన్‌చార్జ్ వైష్ణవి, ఏఎన్‌ఎం సుజాత, ఆప్తమాలజిస్ట్ యామిని డేటా ఎంట్రీ ఆపరేటర్ సంధ్య, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రంలో కంటి పరీక్షలు చేయించుకుని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బానోతు నాగునాయక్ కోరారు. బుధవారం ఆయన స్థానికంగా కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నరసింహనాయక్, గ్రామపెద్దలు రవీందర్‌నాయక్, కార్యదర్శి నాగేశ్వరరావునాయక్, కంటివెలుగు వైద్య బృందం పాల్గొన్నారు.

అనంతగిరి : కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాలారం గ్రామంలో త్రిపురవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీవనశైలీ వ్యాధులైన బీపీ, షుగర్‌లకు ఎన్‌సీడీ మందుల కిట్‌లను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసన్న, కంటి వెలుగు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించాలి

పాలకవీడు : మండలంలో వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. కుక్కలు, కోతుల దాడిలో ప్రజలు గాయాలపాలవుతున్నారన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లేటప్పుడు వెంటపడి గాయపరుస్తున్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కుక్కల దాడిలో బాలుడు మృతి చెందాడని తెలిపారు.. ఆ బాలుడి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు సత్యం, జానయ్య పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

హుజూర్‌నగర్‌రూరల్ : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కరక్కాయలగూడెం సమీపంలోని గుట్టబండ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ కట్టా వెంకటరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. పలువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 30 వేల 350 నగదు, 5 సెల్ ఫోన్లు, 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని 8మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.4 లక్షల నిధులు

మునగాల : మండల కేంద్రంలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ నిధుల నుంచి ఒక్కొక్క కేంద్రానికి రూ.రెండు లక్షల చొప్పున కేటాయిస్తున్నట్లు ఎంపీటీసీ-1, 2 సభ్యురాళ్లు కాసర్ల కల్పన, ఉప్పుల రజిత తెలిపారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. సర్పంచ్ ఉపేందర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ నీరు అందించనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, మాణిక్యం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మఠంపల్లి : మండలంలోని బాడవాతండా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ దారావత్ గోవింద్‌నాయక్ అన్నారు. ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.8 లక్షలతో బుధవారం స్థానికంగా సీసీ రోడ్డు పనులను పాలకవర్గం, గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఉప సర్పంచ్ బాలు నాయక్, కార్యదర్శి నాగిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు సీతారాం, పాండు, భాషా, బాల, సైదా, బాబు, నాగా, రమేష్, లక్ష్మానాయక్, బుజ్జి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో కోదాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఆ గ్రామ సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, ఆర్టీసీ సిబ్బంది రవికుమార్, అబ్దుల్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు నూకపంగు గుర్వయ్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

నడిగూడెం : ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని స్థానిక శ్రీ షిర్డీ సాయి ట్రస్టు అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని షిర్డీ సాయి మందిర ఆవరణలో భోజనశాల నిర్మాణానికి వందనపు కృష్ణవేణి జ్ఞాపకార్థం ఆమె భర్త వెంకటేశ్వర్లు నడిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.25 వేల విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే శాశ్వత అన్నదాన కార్యక్రమం కోసం రూ.11,116 లు ఇచ్చారు. ఆలయ ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారుడు పసుపులేటి భిక్షం, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కోదాడరూరల్ : ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎంపీపీ చింతకవితారాధారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నల్లబండగూడెంలో ఏశర్ల ముత్యాలమ్మ గుడి నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆలయ వద్దం ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, సర్పంచ్ సుశీలబెంజిమెన్, ఎంపీటీసీ క్రాంతికుమార్, పీఏసీఎస్ చైర్మన్ రమేష్, ఆలయ చైర్మన్ చిన్నలింగయ్య తదితరులు ఉన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో 402 గొర్రెలు, 200 మేకలకు నట్టల నివారణ మందులను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి రవినాయక్ తెలిపారు. పశువైద్య సిబ్బంది సబేరా, సాయికృష్ణ, నర్సింహాచారి, మూగజీవాల పెంపకందారులు మారయ్య, సైదులు తదితరులున్నారు.

చిలుకూరు పశువైద్యశాలలో..

చిలుకూరు : చిలుకూరు పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎంపీపీ బండ్ల ప్రశాంతీకోటయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, పశువైద్యాధికారి వీరారెడ్డి, డీఎల్‌డీపీ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ..

చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో షుగర్, బీపీ కిట్లను ఎంపీపీ బండ్ల ప్రశాంతీకోటయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ కొడారు బాబు, డాక్టర్ సుశీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునగాల : మండలంలోని జగన్నాధపురంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన సీపీఎం సీనియర్ కార్యకర్త వెంపటి రాములు కుటుంబానికి బుధవారం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో స్వర్గీయ ఆదిరెడ్డి జ్ఞాపకార్థం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. షేక్ సైదా, వీరబోయిన వెంకన్న, వెంపటి వీరబ్రహ్మం, భూతం వెంకన్న, వీరబాబు, పరుశరాములు, శ్రీను, సుందరయ్య పాల్గొన్నారు.